# మహిళా శక్తిని గుర్తిస్తేనే పురోగతి

- అవకాశాలను అందిపుచ్చుకోవాలని పలువురి పిలుపు
- పలు ప్రాంతాల్లో మహిళలకు సన్మానం

**మైలార్‌దేవ్‌పల్లి:** మహిళల శక్తిని గుర్తించి వారికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ కమ్యూనిటీహాల్‌లో స్థానిక సిద్ధారాల సంతోష్ సహకారంతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్పీలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, స్థానిక మహిళలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళల హక్కులు, సాధికారిత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అమోఘం అన్నారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలను సన్మానించడం గర్వకారణమన్నారు. క్లబ్ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, సహాయ కార్యదర్శి కొంపల్లి జగదీష్, సంకృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు విజయలక్ష్మి, చెన్నమ్మ, హేమలత, అనిత, లక్ష్మీమాధవి, ఆర్పీలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

**వట్టినాగులపల్లిలో..**

**మణికొండ:** మహిళలు ఆరోగ్యంగా, అభివృద్ధి దిశలో ఉన్నపుడే సమాజం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తుందని డాక్టర్ అనూష అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని ఎస్ఓఎస్ అనాథాశ్రమంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు పౌష్టికాహారం తీసుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఎస్ఎస్‌జే ఫార్మసీ కళాశాల హెచ్ఓడీ సరిత మాట్లాడుతూ... సమాజంలో మహిళలకు అన్ని రంగాలలో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకుని రాణించాలన్నారు. ఎస్ఓఎస్ బాలల గ్రామం ఏవీడీ గౌరీ ప్రసన్న మాట్లాడుతూ... తమ సంస్థ అనాథ బాలబాలికలతో పాటు మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన సహకారం అందిస్తున్నామన్నారు.

## మహిళలను ప్రోత్సహిస్తే సమాజాభివృద్ధి


బాబుల్‌రెడ్డినగర్ కమ్యూనిటీహాల్‌లో ఆర్పీలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలను సన్మానిస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

**నార్మ్‌లో...**

**ఏజీవర్సిటీ:** రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)లో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యూఢిల్లీ ఐసీఎఆర్–డీకేఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనురాధ అగర్వాల్ మాట్లాడుతూ... మహిళలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త పి. పద్మావతి మాట్లాడుతూ... మహిళలు స్వీయ సంరక్షణ, స్వీయ పురోగతిపై దృష్టి సారించాలని సూచించారు మహిళా సాధికారత మాటల్లో కాకుండా ఆచరణలో ఉండాలని, కుటుంబ స్థాయిలోనే అమలు కావాలని నార్మ్ డైరెక్టర్ ఆర్.సి.అగర్వాల్ పేర్కొన్నారు. దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీసెస్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. నార్మ్ జాయింట్ డైరెక్టర్ గోపాల్ లాల్, మహిళా సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ బి.నిర్మల, డా. రామసుబ్రమణియన్ పాల్గొన్నారు.

**మహిళలకు విద్య ఎంతో అవసరం**

**మణికొండ:** ఆధునిక సమాజంలో మహిళలకు విద్య, ఆర్థిక స్వావలంబన ఎంతో అవసరమని ఆర్‌బీఐ రిటైర్డ్ జనరల్ మేనేజర్ యశోదాబాయి అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉన్నత విద్యలో రాణించినపుడే మహిళలకు ఉన్నత కెరియర్ వస్తుందన్నారు. న్యూట్రిషన్ డాక్టర్ కవితారెడ్డి మాట్లాడుతూ... మహిళలు తమ నిత్య డైట్ విషయంలో జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. అన్ని రకాల పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. న్యూస్ రీడర్ మాధవి, చైతన్య భారతి ఎడ్యుకేషనల్ సొసైటీ బోర్డు సభ్యురాలు, కోశాధికారి డాక్టర్ సి.జయశ్రీరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, కళాశాల ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ చైర్మన్ డాక్టర్ జి.మాధవి, కన్వీనర్ డాక్టర్ జి.శాంత, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



వట్టినాగులపల్లిలో పాల్గొన్న మహిళలు


నార్మ్‌లో పాల్గొన్న మహిళా అధికారులు



మహిళా దినోత్సవంలో పాల్గొన్న అతిథులు

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

**బండ్లగూడ:** వేసలో నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత జలమండలి అధికారులపై ఉందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ అన్నారు. 20వ డివిజన్‌లో నీటి సరఫరాను పెంచాలని కోరుతూ జలమండలి డీజీఎం, మేనేజర్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ... పలు ప్రాంతాలల్లో గతంలోనే నీటి సరఫరా సరిగా లేక ప్రజలకు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ సమస్య వేసవిలో మరింత అధికంగా ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించారని తగు చర్యలు తీసుకొని నీటి సమస్య రాకుండా చూస్తామని హామీ ఇచ్చారన్నారు.


వినతిపత్రం ఇస్తున్న మాజీ కార్పొరేటర్

## మెకానిక్ షాప్‌లో అగ్ని ప్రమాదం

**మైలార్‌దేవ్‌పల్లి:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ మెకానిక్ షాప్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటన శుక్రవారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. వివరాలివీ... సిరాజ్ అనే వ్యక్తి మెకానిక్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. ఉదయం 7 గంటల ప్రాంతంలో షాపులోంచి మంటలు వస్తుండటాన్ని స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సర్వీసింగ్ కోసం ఇచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

## ప్రశాంతంగా రంజాన్ మొదటి శుక్రవారం ప్రార్థనలు

**గోల్కొండ:** రంజాన్ మాసం మొదటి శుక్రవారం ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. కార్వాన్, మెహిదీపట్నం, అహ్మద్‌నగర్, టోలిచౌకి తదితర ప్రాంతాల్లోని జామా మసీదులు ప్రార్థనలకు వచ్చి న వారితో కిటకిటలాడాయి. గోల్కొండ అక్బరీ మసీ దులో జరిగిన ప్రార్థనలకు కుతుబ్‌షాహీ ఈద్గా కతీబ్ మౌలానా కారీ మతీన్ అలీషా ఖాద్రి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన రంజాన్ మాసంలో దాన ధర్మాలు చేయడం, తరావీ ప్రార్థనలు చేయడం తదితర వాటిపై వివరించారు.

## ఎన్‌సీసీ సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం

**విజయనగర్‌కాలనీ:** ఎన్‌సీసీ సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్, మిలటరీ అధికారులు ఉమేష్ చంద్ర, ముత్యవేణి, లెఫ్టినెంట్ కల్నల్ సి.కార్తిక్ కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలికి సీనియర్ విద్యార్థులకు వీడుకోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి విపత్తులు, ఇతర అత్యవసర ఆపద సమయాల్లో ఎన్‌సీసీ విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు.

## ‘లోప్రెషర్’ సమస్యను పరిష్కరించండి

**మణికొండ:** వేసవి రాకముందే చాలా కాలనీలకు నీటి సరఫరాను తగ్గించి లో ప్రెషర్‌తో సరఫరా చేయటంతో ప్రజలకు నీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని నివారించి వారికి సరిపడ నీటిని అందించాలని బీజేపీ నాయకులు జలమండలి అధికారులను కోరారు. శుక్రవారం మణికొండ జలమండలి అధికారులను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జీఎం మహేందర్‌నాయక్, డీజీఎం మహేష్‌లను కలిసి పలు కాలనీలకు తక్కువగా సరఫరా అవుతున్న నీరు, అవి సరిపోక ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. గేటెడ్ కమ్యూనిటీలు, బల్క్ కనెక్షన్‌ల వారికి సరిపడినంత నీటిని సరఫరా చేస్తూ పేదలు, సామాన్యులు నివసించే కాలనీల వారికి మాత్రం తక్కువ నీటిని సరఫరా చేయటం భావ్యం కాదన్నారు. ప్రజలకు బోర్లు వట్టిపోవటం, జలమండలి వారు సరఫరా చేస్తున్న నీరు సరిపోక ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. గతంలో గంటకు పైగా సమయం నీటిని సరఫరా చేయగా ప్రస్తుతం 40 నుంచి 45 నిమిషాలకు తగ్గించటం ఏమిటని ప్రశ్నించారు. నీటి సరఫరా సమయం, ప్రెషర్‌ను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, నాయకులు సి.బీరప్ప, జె.సిద్ధప్ప, నర్సింగ్‌రావు, ఆనందరావు, ఒదేలు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సందర్శించారు. మూడు నెలలకొసారి జరిగే సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా ఆయన సందర్శించారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, పలు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



గోడౌన్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## విద్యుత్ సమస్యలు తలెత్తనివ్వం


పుప్పాలగూడలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ

**మణికొండ:** వేసవి ప్రారంభం రాకముందే విద్యుత్ వినియోగం పెరిగిపోతున్నదని, అందుకు అనుగుణంగా లోడును తట్టుకునేందుకు అదనపు ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి సమస్యలు లేకుండా నిరంతరాయంగా సరఫరాను కొనసాగిస్తామని విద్యుత్ శాఖ రాష్ట్ర చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫరూఖీ అన్నారు. శుక్రవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అదనపు 12.5 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ నగర శివారులో ప్రతి సంవత్సరం విద్యుత్ వాడకం పెరిగిపోతోందన్నారు. అందుకు అనుగుణంగా కొత్త సబ్‌స్టేషన్‌లు, సామర్థ్యం పెంపు కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. మరిన్ని సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు స్థలాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అవి తమ ఆధీనంలోకి రాగానే వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి తమకు సహకరించాలన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా తమ అధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో పరిష్కరించుకోవాలన్నారు. డైరెక్టర్ నర్సింహులు, సీఈ పాండ్య నాయక్, ఎస్ఈ చంద్రశేఖర్, డీఈ రమేష్‌చంద్ర, ఏడీఈ అంబేడ్కర్, ఏఈ సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

**బండ్లగూడ:** పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా సమస్యలు ఉత్పన్నమైన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్‌లోని వ్యాలీ వ్యూ ఎంక్లేవ్‌లో రహదారిపై స్వీపింగ్ పనులు, అండర్ డ్రైనేజీ క్లీనింగ్, 2వ డివిజన్‌లోని గంధంగూడలో అండర్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికులు విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు రామంజులు, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

## వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**గచ్చిబౌలి:** గుర్తు తెలియన వాహనం బైక్‌ను ఢీ కొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయపడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... టోలీ చౌకీ హకీంపేట్‌కు చెందిన ముస్తాఫా అలీ(40) ఓ ప్రైవేట్ కంపెనీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో వెళుతుండగా హెచ్‌సీయూ ప్రధాన ద్వారం సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనకనుంచి ఢీ కొట్టింది. ఎగిరి కిందపడటంతో ముస్తఫాకు తీవ్ర గాయాలయ్యాయి. అమీర్‌పేట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఢీ కొట్టిన వాహనం కోసం పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రేపు ‘ఫెడరేషన్’ ఎన్నికలు

**మణికొండ:** ఆల్ కాలనీస్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఫెడరేషన్ కార్యవర్గానికి ఆదివారం ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారులు ఎం. సత్యనారాయణ మూర్తి, బి.వి.సత్యనారాయణ తెలిపారు. ఎన్నికలు సాయిరాం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందన్నారు. కార్యవర్గంలో అత్యధిక స్థానాలకు సరిపడా మంది నామినేషన్లు వేశారని, అధ్యక్షుడు, ఉపాధ్యక్ష పదవులకు మాత్రం ఎక్కువ మంది పోటీ చేస్తుండటంతో ఎన్నికలు అనివార్యం అయ్యాయన్నారు. అధ్యక్ష స్థానానికి గతంలో పలు పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేసిన, హుడాకాలనీకి చెందిన డి.సీతారాందాస్, అలకాపూర్ టౌన్‌షిప్ అధ్యక్షుడు వంశీలు పోటీ పడుతున్నారన్నారు. ఉపాధ్యక్ష స్థానానికి నాలుగు పురుష, ఒక మహిళ పదవులు ఉండగా ఎం. కృష్ణకుమార్, జి.గోవర్ధన్‌రెడ్డి, వేముల శ్రీధర్, జి.సింహారాజిరెడ్డి, వి.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.బి.రాజశేఖర్, తోట ప్రవీణలు పోటీపడుతున్నారని ఎన్నికల అధికారులు వివరించారు. అధ్యక్ష స్థానానికి పోటీలో ఉన్న ఒకరికి, ఉపాధ్యక్ష స్థానానికి పురుషుల విభాగంలో పోటీలో ఉన్న ఆరు మందిలో నలుగురికి టిక్ మార్కులు పెట్టి ఓటు వేయాలని వారు కోరారు.

## అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోండి

**మణికొండ:** ముష్కి చెరువు పరీవాహక ప్రాంతంలో రాత్రి వేళల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను నార్సింగి పోలీసులు అడ్డుకోవాలని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు కోరారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అధ్యక్షతన పార్టీ నాయకులు గుడ్‌మార్నింగ్ మణికొండ కార్యాక్రమంలో భాగంగా శుక్రవారం ముష్కి చెరువు పక్కనే ఉన్న సాయి గౌతమ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు చెరువు చుట్టూ నిర్మానుష ప్రదేశం ఉండటం, పెద్ద ఎత్తున నిర్మాణాలు కొనసాగుతుండటంతో గంజాయి, మద్యం, వ్యభిచారం లాంటి కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. చెరువును ఆక్రమిస్తూ చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి చెరువు హద్దులు నిర్ణయించాలని, ఈ విషయాన్ని త్వరలోనే జిల్లా కలెక్టర్‌ను కలిసి కోరతామన్నారు. చెరువులో గుర్రపు డెక్క, దుర్గంధం పెరిగిపోవటంతో దోమల సమస్య తీవ్రంగా ఉందన్నారు. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు చుట్టుపక్కల అక్రమంగా కొనసాగుతున్న నీటి వ్యాపారాన్ని అరికట్టాలని కోరారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు జి.విఠల్, ఎస్. శ్రీకాంత్, బి.మల్లేష్, మాల్యాద్రినాయుడు, షేక్ ఆరీఫ్, దిలీప్, కె.ప్రవీణ్, సుమనళిని, భానుచందర్, బి.శ్రీధర్ పాల్గొన్నారు.

## మాస్టర్ డిజైనర్‌గా ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు

**రాయదుర్గం:** ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ ఫ్యాకల్టీ డాక్టర్ ముప్పిడి రాంబాబును మాస్టర్ డిజైనర్‌గా యూసుఫ్‌గూడలోని రహమత్‌నగర్‌లోని సీఆర్ఎస్ స్కిల్‌వర్సిటీ నియమించింది. ఆయనను ఈ నెల 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్మల్ పట్టణంలో జ్యూట్ బ్యాగుల తయారీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ డిజైనర్‌గా మహిళలకు శిక్షణ ఇచ్చే అవకాశం కల్పించారు. శిక్షణ పొందేవారికి జ్యూట్ బ్యాగుల తయారీ చేయడం, మార్కెటింగ్ చేసుకోవడం, సాంకేతిక సలహాలు ఇవ్వాలని నిర్వాహకులు సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ... జ్యూట్ బ్యాగుల తయారీలో ఇప్పటికే చాలా మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. తాజాగా నిర్మల్‌లో కూడా ఇలాంటి అవకాశం వచ్చిందని ఆయన తెలిపారు. మహిళలు తమకాళ్లపై తాము నిలబడేలా చేయడానికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు.

## స్త్రీ మూర్తి సేవలు వెలకట్టలేనివి

**రాయదుర్గం:** స్త్రీ మూర్తి సేవలు వెలకట్టలేనివని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ‘మానవజాతికి ప్రాణం పోసింది మగువేనన్నారు. త్యాగం అనురాగంలో తరగగని పెన్నిధి మగువ’ అంటూ స్త్రీ మూర్తి గొప్పతనాన్ని ఓ మహాకవి చాటాడని గుర్తు చేశారు. ‘ఎస్కీ’ ప్రాంగణంలో పాలసీ బజార్ సౌజన్యంతో బంజారాహిల్స్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి సహకారంతో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్కీలో పనిచేసే మహిళా ఉద్యోగులు, అధికారులు, చదివే విద్యార్థులు వివిధ రకాల వైద్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ వైద్య పరీక్షలను డాక్టర్ సుష్మతో పాటు మౌనిక, పూజ, మేనేజర్ గోపి, రవి, సునీల్‌కుమార్, పాలసీబజార్ నుంచి తేజశ్వర్‌శాస్త్రి, ఆదర్శ్ పాల్గొన్నారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలను ముఖ్యంగా మ్యూజికల్ చైర్స్, షటిల్స్ పోటీలను నిర్వమించారు. పర్యావరణ విభాగం హెడ్ అనితా అగర్వాల్, కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంతరావు, శ్రీధర్‌బాబు, డాక్టర చంద్రకళ, డాక్టర్ ఎం సింధు, డాక్టర్ పి రాజారావు, వై పద్మావతి, శ్వేత, సునీత, సౌమ్య, జ్యోతి, సరస్వతి, కవిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

